

కోటప్పకొండపై.. తొలి ఏకాదశి సందడి

కోటప్పకొండ (నరసరావుపేట), జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర సన్నిధిలో బుధవారం భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండకు వేలాదిగా తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు. ఆనందవల్లి అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. సోపాన మార్గంలో భక్తులు మెట్ల పూజలు చేశారు. వినాయక స్వామి విగ్రహం, ధ్యాన శివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎన్ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వివిధ సేవా సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి.

శ్రీ త్రికోటేశ్వర స్వామికి నాగాభరణం

శ్రీ త్రికోటేశ్వర స్వామికి భక్తులు వెండికి బంగారం పోత పోసిన నాగాభరణం సమర్పించారు. రూ 6 లక్షల విలువైన నాగాభరణాన్ని పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మహంకాళి నాగరాజు, లక్ష్మీ, మహంకాళి శ్రీకాంత్, లక్ష్మీ స్వామికి కానుకగా ఇచ్చారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ఎమ్మెల్యే పుల్లారావు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.



జలాభిషేకం



పసుపుతో..



కుంకుమతో..



గంధంతో..



విభూదితో..



ప్రత్యేక అలంకారం

సర్టిఫికెట్ కష్టాలు తీరినట్లే..

- ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు బకాయిలు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ.80 కోట్లుపైనే
- వైసీపీ జమానాలో ఖాతాల్లో జమ కాని ఫీజులు



బీటెక్, ఫార్మసీ డిగ్రీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. కళాశాలలకు ఉన్న బకాయిల్ని చెల్లించడానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఇటు విద్యార్థుల్లో, అటు యాజమాన్యాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభకు పరిష్కారం లభించనుంది.

గుంటూరు(విద్య),జులై 17: ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీటెక్, ఫార్మసీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉండవచ్చని అంచనా. గత ప్రభుత్వం కళాశాలల వారీగా ఫీజుల్ని నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.40 వేల నుంచి రూ.75 వేలకుపై ఫీజుల్ని కళాశాలల్లో ఉన్న వసతుల్ని బట్టి నిర్ణయించింది. అయితే ఈ ఫీజుల విషయంలో అనేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫీజులను సవరించాలని యాజమాన్యాలు అనేకసార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అనేక కళాశాలలు నిర్వహణ భారం మోయలేక ఆర్థికంగా కుదేలయ్యాయి.

కొత్త విధానంతో ఇక్కట్లు

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీసుకువచ్చిన కొత్త విధానం అటు విద్యార్థులకు, ఇటు యాజమాన్యాలకు తలనొప్పిగా పరిణమించింది. గతంలో ప్రభుత్వం చెల్లించే ఫీజులు విడతల వారీగా నేరుగా కళాశాలల ఖాతాలకు జమయ్యేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఫీజుల విషయంలో రివర్స్ విధానం తీసుకువచ్చింది. విడతల వారీగా సీఎం జగన్ బటన్ నొక్కి ఫీజుల్ని విద్యార్థుల తల్లుల ఖాతాలకు మళ్ళించారు. ఖాతాల్లో జమ అయిన ఫీజుల్ని బ్యాంకుల నుంచి డ్రా చేసి తల్లులు కళాశాలలకు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనేక సార్లు బటన్ నొక్కినా ఫీజులు సకాలంలో వారి ఖాతాల్లో జమకాలేదు. ఒకవేళ తల్లుల ఖాతాల్లో డబ్బులు పడినా, వాటిని వారు సొంత అవసరాలకు వాడుకున్న ఉదంతాలు ఉన్నాయి. ప్రతి కళాశాల పరిధిలో కనీసం 35 నుంచి 45శాతం మంది ఇలా ఫీజుల్ని చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో సకాలంలో ఫీజుల చెల్లింపులు జరగక పోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు కష్టంగా మారింది. ఒకవైపు సకాలంలో ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, వచ్చిన ఫీజుల్ని తల్లిదండ్రులు సకాలంలో చెల్లించక పోవడం వంటి కారణాలు జిల్లాలో నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో బీటెక్ చివరి సంవత్సరం వరకు విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.80 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. దీంతో ఫీజుల బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు విద్యార్థులకు తెగేసి చెప్పాయి. ఫలితంగా బీటెక్, ఫార్మసీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాని పరిస్థితి నెలకొంది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు, ఎంటెక్ ఇతర కోర్సులకు దరఖాస్తు చేసిన అనేక మంది ఇక చేసేది లేక కళాశాలకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే ఫీజులు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నేరుగా కళాశాలల ఖాతాలకే ఫీజులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తుంది.

మొదటి విడత సీట్లు కేటాయింపు పూర్తి

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న వారికి మొదటి విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తి అయింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 22లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని పేరున్న కళాశాలల్లో మాత్రమే పూర్తిస్థాయి సీట్లు భర్తీ అయ్యాయి. త్వరలో నిర్వహించే రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ భూమి.. ప్రభుత్వానికే.. దానం!

నిరుపేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూమిని చట్ట ప్రకారం కొనడం, అమ్మడం నేరం.. అంటే చట్టప్రకారం ఆ భూమిపై సర్వహక్కులు ప్రభుత్వానివే.. అలాంటిది బాపట్ల మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఓ రేంజ్ జగన్నాటకానికి గతంలో వైసీపీ ప్రభుత్వం తెరలేపింది. అసైన్డ్ భూమి అంటేనే అది సాంకేతికంగా ప్రభుత్వ భూమి కింద లెక్క..అలాంటిది దానిని ఓ వ్యక్తి ఉదార వైఖరితో బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం కోసం దానం ఇచ్చారట.. అదినచ్చి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేత సదరు వ్యక్తికి సన్మానం కూడా చేయించారు.. ఈ తంతు అంతటిని అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు చోద్యం చూశారు. ఇది బాపట్ల మెడికల్ కళాశాల స్థలం విషయంలో వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న వింతవైఖరి. అన్నింటికన్నా మించి పరాకాష్ట ఏమిటంటే అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం ఆ భూమిలో పేదలెవరు లేని కారణంగా దానిని తిరిగి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. మరి ఇక్కడ వితరణకు అవకాశం ఎక్కడ ఉందనే దానికి అప్పటి ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ వెనకాల మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల ధర పెంచే కుట్ర జరిగిందనే అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.

దానికి సీఎంతో సన్మానం



- అసైన్డ్ భూమికి కొత్త భాష్యం చెప్పిన వైసీపీ
- బాపట్ల మెడికల్ కళాశాల భూ వ్యవహారంపై అనుమానాలు
- మొత్తం వ్యవహారంలో క్విడ్ ప్రో కోపై సందేహాలు
- సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం కోసం పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 54 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ప్రభుత్వం గుర్తించి 2021 మేలో భూమిపూజ చేపట్టింది. ఈ 54 ఎకరాలతో పాటు దీని చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల వరకు అసైన్డ్ భూమిగానే ప్రభుత్వ రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. కానీ కళాశాల నిర్మాణం కోసం భూమిని దాత విరాళంగా ఇచ్చారని అప్పట్లో వైసీపీ నేతలు ప్రకటించారు. మరోవైపు ఈ భూమి అసైన్డ్ అని పేదలెవరూ లేని కారణం చేత తిరిగి ప్రభుత్వం తీసుకుని కళాశాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఓ రకమైన ఆదేశాలిస్తే, వైసీపీ నేతలు మాత్రం ఆ భూమిని ఓ వ్యక్తి వితరణగా ఇచ్చారని ప్రచారం చేశారు..

సన్మానం చేయడం ఏమిటి..

వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల చట్టవిరుద్ధ క్రయవిక్రయాలకు ఏ విధంగా మద్దతు పలికారు అనేదానికి బాపట్ల మెడికల్ కళాశాల భూమి అంశాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. అసైన్డ్ భూములను కొనడమే నేరమని చట్టం చెబుతుంటే ఆ భూములను కొనుగోలు చేసి సుదీర్ఘకాలం అనుభవించిన వ్యక్తి వితరణ ఇచ్చాడని చెప్పి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డే సన్మానం చేయడం, దానికి సాక్షీభూతాలుగా ప్రభుత్వ అధికారులు నిలవడం ఏమిటనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. కొత్తప్రభుత్వం కొలువుదీరగానే ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా అసైన్డ్ బాగోతాలపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా కొత్త ప్రభుత్వం చేస్తోంది. ఈ నేపథ్యంలో బాపట్లలో జరిగిన మెడికల్ కళాశాల అసైన్డ్ భూమి వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చేసిన హడావిడి మరోమారు చర్చకు వచ్చింది. అసైన్డ్ భూమిని వితరణగా ఇచ్చారని చెప్పి ఏకంగా ప్రభుత్వాధినేత చేతే సన్మానం చేయించే బరితెగింపునకు అప్పటి వైసీపీ నేతలు పాల్పడ్డారంటే చట్టాలపై వీరి లెక్కలేని తనానికి ఈ ఉదంతం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

తొలుత పరిహారం పేరుతో కుట్ర...

మెడికల్ కళాశాలకు భూ సేకరణ అంశం అప్పట్లో తెర మీదకు వచ్చినప్పుడు తొలుత అసైన్డ్ భూముల్లో పేదలే ఉన్నట్లు చూపి పరిహారం సాకుతో కోట్లు దోచేయాలని వైసీపీ నేతలు పథకం వేశారు. కానీ ఆ భూమి మొత్తం అసైన్డ్ చేసిందేనని, అక్కడ పేదలెవరూ సాగుచేయడం లేదనే అంశం బయటకు పొక్కడంతో వితరణ నాటకానికి వైసీపీ నేతలు ముగింపు పలికారు. భూముల ధర పెంపుకోసం క్విడ్ ప్రోకో ప్రాతిపదికనే ఈ తతంగం అంతా జరిగినట్లు సమాచారం.

విచారణ చేయించాల్సిందే..

మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల భూమి కూడా పేదలకు అసైన్డ్ చేసినదే. ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ చేసిన పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే క్రమంలో బాపట్ల పరిధిలో ఉన్న దాదాపు 2300 ఎకరాలకు సంబంధించి ఒక్కరంటే ఒక్కరు కూడా ఒరిజినల్ అసైనీ సదరు భూమిని అనుభవించడం లేదని తేల్చేసి ఎవరికీ యాజమాన్య హక్కులు కల్పించలేదు. మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూముల విషయంలో ఇదే నివేదికను గతంలో అధికారులు ఇచ్చారు. కానీ మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూములు పేదల నుంచి వైసీపీ నేతల చేతతిలోకి మారినట్లు సమాచారం. వాటికి ధర పెంచి రియల్ సొమ్ము చేసుకునే క్రమంలోనే ఈ వితరణ నాటకానికి తెరలేపి క్విడ్ ప్రో కో కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న అసైన్డ్ భూములలో ఒరిజినల్ అసైనీ లేరని ఇప్పటికే గత ప్రభుత్వం ధ్రువీకరించింది. అలాంటప్పుడు ఆ భూములను కూడా తిరిగి స్వాధీన పరచుకునే విధంగా కొత్త ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. అప్పుడే గత ప్రభుత్వంలో వ్యూహం ప్రకారం అసైన్డ్ భూమి దానం అనే నాటకానికి తెరలేపిన వైసీపీ నేతల కుయుక్తులను ఛేదించినట్లవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇంత వరకు పునాదులు దాటలేదు..

2021 మే 31న మెడికల్ కళాశాలకు ఆర్భాటంగా భూమి పూజ చేసిన వైసీపీ నేతలు తర్వాత ఏడాదిన్నర వరకు పనులు ప్రారంభించిన దాఖలాలే లేవు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మళ్లీ మెడికల్ కళాశాల పనులు అంటూ హడావిడి చేశారే తప్ప దాని నిర్మాణం పూర్తి విషయం లో చిత్తశుద్ధి చూపకపోవడం గమనార్హం.

రైళ్ల స్టాపేజ్‌ల కొనసాగింపు

- చెన్నై, నారాయణాద్రి, విశాఖ నిలుపుదలకు అంగీకారం
- గత రెండు పర్యాయాలు ఆరు నెలల గడువు విధింపు
- ఈ దఫా ఎలాంటి సమయాన్ని పేర్కొనకుండా ఉత్తర్వులు



గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై, విశాఖ, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అమల్లో ఉన్న హాల్ట్‌లను పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. కోవిడ్ సమయంలో సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లలో ఆయా రైళ్లకు నిలుపుదల సౌకర్యాన్ని ఎత్తేసింది. ప్రయాణికుల ఇబ్బందులను అప్పటి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రైల్వే బోర్డుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఏడాది క్రితం ఆయా రైళ్లకు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌ను రైల్వేశాఖ అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత ఆరు నెలల, ఆ తర్వాత మరో అర్ధ సంవత్సరం పాటు ఆయా స్టేషన్లలో మూడు రైళ్లకు నిలుపుదలని కల్పించింది. ఆరు నెలల క్రితం పొడిగించిన గడువు తేదీ సమీపించడం, మరి కొంత కాలం/శాశ్వతంగా హాల్ట్‌లను అమలు చేసే విషయంలో రైల్వే శాఖ నిర్ణయాన్ని ప్రకటించే విషయంలో రైల్వే శాఖ కాస్త జాప్యం చేసింది. బుధవారం సాయంత్రం వరకు కూడా వచ్చే సోమవారం నుంచి ఈ మూడు రైళ్లకు రిజర్వేషన్ సిస్టమ్‌లో గుంటూరు తర్వాత సికింద్రాబాద్ స్టేషన్ మాత్రమే కనిపించింది. అయితే ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు పొడిగింపు నిర్ణయాన్ని రైల్వే బోర్డు బుధవారం రాత్రికి ప్రకటించింది. ఈ ప్రకారం గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్లే చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు ఈ నెల 21 నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లలో నిలుపుదల సౌకర్యం కొనసాగుతుంది.

మరికొన్ని రైళ్లకు..

నెంబరు.17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 22 నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో, నెంబరు. 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 21 నుంచి వేజండ్లలో, నెంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కి గిద్దలూరు, మార్కాపురం రోడ్డులో, నెంబరు. 17256 హుబ్లీ-నరసపూర్ మంగళగిరిలో, నెంబరు.17643 సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 23 నుంచి మంగళగిరి, న్యూగుంటూరులో నిలుపుదల సౌకర్యాన్ని కొనసాగించనున్నట్లు డీఆర్ఎం ప్రకటించారు. చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు నల్గొండ, మిర్యాలగూడలోనూ నిలుపుదలని కొనసాగిస్తామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- బేసిక్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి
- బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సతీష్‌కుమార్



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ సతీష్ కుమార్

గుంటూరు, జూలై 17: 'గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపతాం. ఇప్పటి వరకు జిల్లాలో గంజాయి రవాణా చేసిన, విక్రయిస్తున్న వారిని గుర్తించి వారి కదలికలపై నిఘా ఉంచుతాం. గంజాయిని ఎక్కడి నుంచి తరలిస్తున్నారనేది తెలుసుకుని సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం..' అని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పోలీస్ కార్యాలయంలో ఎస్పీగా ఎస్ సతీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత వీరభద్రస్వామికి పూజలు చేసిన అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి కట్టడికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి తాగుతున్నా, విక్రయిస్తున్నా, రవాణా జరుగుతున్నా ప్రజలకు సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రధానంగా జిల్లాలో బేసిక్ పోలీసింగ్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల ధన మాన ప్రాణాలు కాపాడటమే తమ కర్తవ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులన్నింటిపై అధ్యయనం చేసిన తర్వాత కొద్ది రోజుల్లో అందుకు తగిన విధంగా కార్యాచరణ ప్రారంభిస్తామన్నారు. పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు తగిన విధంగా పోలీసులు లేరని, సంఖ్యాపరంగా పోలీసులు తక్కువగానే ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు ఒక సవాల్‌గా ఉంటుందన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు తమవంతుగా సహకారం అందించాలని కోరారు. ప్రజలకు పోలీసులు వైపు నుంచి ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్నా నేరుగా తనను వచ్చి కలవచ్చని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, నేరాలను కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా నేరాలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు.

శాంతి భద్రతలపై ఐజీతో భేటీ

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సతీష్‌కుమార్ రేంజ్ ఐజీ త్రిపాఠిని, కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేంజి ఐజీతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లాలో శాంతి భద్రతల సమస్యలతో పాటు వివిధ అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. నూతన ఎస్పీని ఏఎస్పీలు శ్రీనివాసరావు, రమణమూర్తి, శ్రీనివాసరావు, నచికేత్ షెల్కేతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన సమీపంలోని చర్చిలోనూ, మసీదులోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలన ప్రారంభం
- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 17: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు మంత్రి వర్గం ఆమోదం తెలపటం హర్షణీయమని సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లును మంత్రివర్గం ఆమోదించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను ప్రభుత్వం నిలిపి వేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, ఆ సంక్షోభ భారాలను తట్టుకొని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అజెండాలతో ముందుకు వెళుతూ ఎన్నికల హామీల అమలు దిశగా పయనిస్తుందన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడి ఆత్మహత్యలు చేసుకున్నారన్న విషయాన్ని కన్నా గుర్తుచేశారు. ఆగస్టు 15 నుంచి అన్నక్యాంటీన్‌ల సేవలు ప్రారంభం కానున్నా యన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు.పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. నియోజక వర్గ ప్రజలకు కన్నా లక్ష్మీనారాయణ తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులను మోసం చేసిన జగన్‌రెడ్డి

- చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుని సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

చిలకలూరిపేట అర్బన్, జూలై 17 : ఆర్టీసీ కార్మికులను మాజీ సీఎం జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చిలకలూరిపేట ఆర్టీసీ డిపో ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ.. విలీనం పేరిట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాలరాసివేసి వారు కోలుకోలేని విధంగా దెబ్బతీసిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. సంక్షోభంలో కూరుకుపో యిన ఆర్టీసీకి పునర్జీవింప చేయటం కోసం కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సర్వీసుల పెంపు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ మరింత ఆదరణ, ఆదాయం రెండు పెరుగుతాయన్నారు. 2019 ఎన్నికల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామి ఇచ్చిన జగన్ పేరుకు చేసినా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని ప్రయోజనాలు కల్పించ లేదు సరి కదా ఆర్టీసీలో ఉన్నప్పుడు వారు పొందిన అనేక సదుపాయలకు కోత విధించారని మండి పడ్డారు. బకాయిలను చెల్లించ లేదని, విలీనం జరిగి ఏళ్ళు గడుస్తున్నా వారికి ఏ పింఛన్ ఇస్తారో చెప్పలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య లన్నీ పరిష్కరించాల్సి ఉందన్నారు.

ప్రజా దర్బార్‌కు విన్నపాల వెల్లువ

- 17వ రోజు వెల్లువెత్తిన ప్రజానీకం
- వినతులు స్వీకరించి పరిష్కరిస్తానన్న మంత్రి లోకేశ్



తాడేపల్లి, జులై 17: రాష్ట్ర మంత్రి, యువనేత నారా లోకేశ్ ప్రవేశ పెట్టిన ప్రజాదర్బార్‌కు బుధవారం అర్జీదారులు వెల్లువెత్తారు. కరకట్ట ఆసాంతం అర్జీదారులతో నిండిపోయింది. 17వ రోజు బుధ వారం పలువురు తమ అర్జీలను నారా లోకేశ్‌కు అంద జేసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించగా లోకేశ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం ప్రజలు భారీగా విచ్చేశారు.

బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలి

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ మిని గురుకులాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు విపరీతమైన పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని తగినన్యాయం చేయాలని సెక్రటరియేట్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఐటి మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈవోలు ఆఫీస్ సబార్డి నేట్లకు కాంట్రాక్టు పద్ధతి వర్తింపజేయాలని సిబ్బంది కోరారు.

ప్రేమ వివాహం చేసుకున్న కుమారుడిని హత మార్చారు..

ప్రేమ వివాహం చేసుకున్న తమ కుమారుడిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల అండతో యువతి కుటుంబం కిరాతకంగా హతమార్చారని, తగిన న్యాయం చేయాలని మంగళగిరి మండలం నవులూరుకు చెందిన సత్తెనపల్లి రామాంజనేయులు మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. గుంటూరు లోని ప్రైవేటు ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు సత్తెన పల్లి సీతారామాంజనేయులు పాకనాటి స్వాతి ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టంలేని యువతి తండ్రి శ్రీనివాసరెడ్డి వారి కుటుంబసభ్యుల సాయంతో కిరాతకంగా హత్యచేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న మంత్రి లోకేశ్ పరిశీలించి తగిన చర్య తీసుకుంటామన్నారు.

గల్లా జయదేవ్ కాలనీవాసుల వినతి

మంగళగిరి పట్టణం ఇప్పటం రోడ్డులోని గల్లా జయదేవ్ కాలనీ వాసులు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. కాలనీలో 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తాగునీరు సక్రమంగా అందడం లేదని డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. నూతన పెన్షన్లతో పాటు గత ప్రభుత్వం తొలగించిన రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు పునరుద్ధరించాలని మంగళగిరి నియోజకవర్గంకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు. వినతులు స్వీకరించిన లోకేశ్ వారి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి నారా లోకేశ్‌కు అర్జీలు అందిస్తున్న ప్రజలు

వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రాలు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం
- వేల కోట్ల రూపాయలు దోచుకున్న వైసీపీ నేతలు
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు శ్వేత పత్రాలు విడుదల చేయడం జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలుచేసి ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాలలో బయట పెడుతున్నార న్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటివిలువ 33,576 కోట్లపైనే వుంటుందని, ఇళ్ల పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో 9,750 కోట్లు వైసీపీ నేతలు అక్రమంగా దోచుకున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూదోపిడికి పాల్పడేందుకు కుట్ర పన్నారన్నారు. తక్కువ ధరకు రైతుల నుండి భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మిన వైసీపీ నేతల భాగోతాల గురించి సాక్షాదారాలతో సహా శ్వేతపత్రంలో పొందుపరచడం జరిగిందన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములను, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హాయగ్రీవ భూములను తిరుపతి, రేణిగుంట సమీపంలోని మఠం భూములను, పుంగనూరులో 982 ఎకరాలను వైసీపీ నేతలు కొట్టేశారన్నారు. దస్పల్లా భూములను సైతం కొట్టేసి ఇల్లు కట్టుకున్నారని, చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో 101 కోట్ల ఆస్తిని కాజేసేందుకు వైసీపీ నేతలు యత్నించే ప్రయత్నంచేశారని, వీటిపై విచారణ జరుపుతామని యరపతినేని తెలిపారు. 13,800 ఎకరాల ఆవ భూములను వైసీపీ నేతలకు ధారాదత్తం చేశారని, తక్కువ ధరకు 40వేల ఎకరాలు కొని అధికారులను బెదిరించి ఆ భూములకు పట్టాలు తెప్పించుకున్నారని, రుషికొండలో 500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృధాచేశారని, భూహక్కు పత్రం పేరుతో ప్రచారానికి 13 కోట్లు వైసీపీ ప్రభుత్వం ఖర్చుచేసిందని, వైసీపీ కార్యాలయాల కోసం ప్రతి జిల్లాలో 2ఎకరాలు చొప్పున నామ మాత్రపు లీసుగుతో 33 ఏళ్ల లీజు పొందారని, మొత్తం 300 కోట్ల విలువైన భూమిని కేటాయించుకున్నారన్నారు. కొండలను సైతం జగన్‌రెడ్డి ప్రభుత్వం అనకొండలా మింగేశారని, ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎమ్మెల్యేలే అక్రమంగా భూగర్భ వనరులను తవ్వేశారన్నారు. వైసీపీ నేతలు ఇసుకాసురల అవతార మెత్తి ఇసుకను మింగి వందలాది టిప్పర్ల ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలి స్తున్నా పట్టించుకోకపోవడంతో కోట్లాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. నూతన ఇసుక విధానంతో ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంతో భవననిర్మాణ కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.

ఆర్వీఆర్‌జేసీలో నూరుశాతం సీట్లు భర్తీ

- కంప్యూటర్‌తో పాటు, సంప్రదాయ కోర్సులకు డిమాండ్

గుంటూరు(విద్య),జులై 17: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భర్తీ కోసం ఉన్నత విద్యామండలి నిర్వహించిన ఏపీఈఏపీసెట్ కన్వీనర్ కోటా వెబ్‌కౌన్సిలింగ్‌లో ఆర్వీఆర్‌జేసీలోని అన్నిబ్రాంచీల సీట్లు నూరు శాతం భర్తీ అయ్యాయని ఈ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కే.మద్దినేనిలు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కంప్యూటర్ కోర్సులైన సీఎస్‌ఇ, సీఎస్‌ఎం, సీఎస్‌డి,ఐటీ, సీఎస్‌బీ, సీఎస్‌వో, ఈసీఈ తోపాటు సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచీలకు డిమాండ్ ఏర్పడిందని, ఆయా బ్రాంచీల్లో సైతం సీట్లు నూరుశాతం భర్తీ అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు.


రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, జూలై17: పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని రూరల్ పోలీసులు బుధ వారం అర్ధరాత్రిస్వాధీనం చేసుకున్నారు. రూరల్‌పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బ్రహ్మణకోడూరు అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వెళ్లు తున్న లారీని ఆపి సోదాలు నిర్వహించారు. ఈ లారీలో పది టన్నుల రేషన్ బియ్యం బస్తాలను గుర్తించి వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం కొల్లూరు నుంచి గుంటూరు వెళ్లుతునట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. బియ్యం లారీని స్వాదీనం చేసుకోవటంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై భార్గవ్ వెల్లడించారు.


అఖండ జ్యోతిని వెలిగించిన ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు, ఎస్పీ కే.శ్రీనివాస రావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు

వైభవంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల

- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తుల రాక

వినుకొండ టౌన్, వినుకొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వినుకొండ కొండపై రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురువు ఆధ్వర్యంలో చేపట్టిన హోమాల్లో పాల్గొన్నారు. శాంతి ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకులు హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో కొండపై అఖండజ్యోతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, సాయంత్రం 6.30 నిమిషాలకు అఖండజ్యోతిని ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేతుల మీదుగా హిమాలయ గురూజీ వెలిగించారు.

పశ్చిమడెల్టాకు 2519 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, జూలై 17: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 2519 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 611 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 135 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1393 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

త్రిపురాపురం కొండపై మట్టి మైనింగ్

- అడ్డుకున్న తహసీల్దార్, పోలీసులు
- ఒక ప్రొక్లెయినర్, రెండు ట్రాక్టరులు స్వాధీనం

నకరికల్లు, జూలై 17 : ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమార్కులు యధేచ్ఛగా మట్టి మైనింగ్‌కి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. నకరికల్లు మండలం త్రిపు రాపురం గ్రామ సమీపాన అద్దంకి -నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికి సమీపాన ఉన్న కొండ మట్టిని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. బుధవారం నకరికల్లుకు చెందిన ఒక వ్యక్తి అక్రమ మైనింగ్‌కి సంబంధించిన ఫోటోలు తీసి తహసీల్దార్, ఆర్డీవో, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సత్తెనపల్లి ఆర్డీవో వీ.మురళీకృష్ణ అక్రమంగా మైనింగ్ చేస్తున్న వాహనాలను, అందుకు కారకులను తక్షణమే అందుపులోకి తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తహసీల్దార్ లక్ష్మీనారాయణ పోలీసు అధికారులతో కలసి త్రిపురా పురం కొండ వద్దకు చేరుకొని అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నారు. ఒక ప్రొక్లైనర్, 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మైనింగ్‌లో అక్రమార్కుల పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడి కావాల్సి ఉంది.


మైనింగ్ చేస్తున్న ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్న తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, పోలీసులు అధికారులు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు



విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల చెక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, సాయిరామ్ తదితరులు

విద్య ద్వారానే సమాజాభివృద్ధి

- పేద విద్యార్థుల విద్యోన్నతికి స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి
- 1600 మందికి రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరు, జూలై 17: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి తెలిపారు. పెదపలకలూరులో యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం 1600 మంది విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదించే వారిలో ఎక్కువ మంది ఆస్తులు పెంచుకునేందుకు ఆలోచన చేస్తుంటారని, కానీ ఇలా సమాజం కోసం డబ్బువెచ్చించే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుతం స్కాలర్ షిప్పులు తీసుకునేవారు విద్యా, ఉపాధి రీత్యా ఉన్నత స్థానాలకు చేరుకొని తిరిగి స్కాలర్‌షిప్పులు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంత ఊరిలో విద్యాభివృద్ధి కోసం యేరువ సాయిరామ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు తల్లితండ్రులు తగిన చొరవ చూపాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులే జాగ్రత్త వహించాలని సూచించారు. యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ యేరువ సాయిరామ్ మాట్లాడుతూ తన సొంతూరికి ఎంతో కొంత సాయం చేయాలన్న ఉద్దేశ్యంతోనే తన తండ్రి పేరు మీద ట్రస్ట్‌ని ఏర్పాటు చేశానన్నారు. పలకలూరు హైస్కూల్లో భవనం నిర్మించడంతో ఆరంభమైన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం విరామం లేకుండా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. మొత్తం 52 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలుకి రూ. 36,000 చొప్పున, అలాగే డిగ్రీ, బీటెక్, మెడిసిన్ వివిధ రకాలైన కోర్సులు చేస్తున్న 500 మందికి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అందజేశామన్నారు. సుమారుగా 54 వేల డాలర్లు అంటే రూ.45 లక్షల ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఇకపైనా కొనసాగిస్తామని వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్ పోలూరు వెంకటరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, గుళ్ళపల్లి సుధీర్, నూనె గంగాధర్ రెడ్డి, యేరువ జగదీశ్వరి, యేరువ శ్రీవేణి, యేరువ శ్రీలలిత, పాల వరప్రసాద్, యేరువ రమణి పాల్గొన్నారు.


బాలిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

బాలిక హత్య అమానుషం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
- గుంటూరులో బాలిక కుటుంబ సభ్యులకు పరామర్శ

పొన్నూరుటౌన్, జూలై17: బాలిక హత్య అమానుషమని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఇటీవల చేబ్రోలు కొత్తరెడ్డిపాడు గ్రామంలో హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గుంటూరులో కలిసి పరామర్శించారు. బాలిక శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇలాంటి అమానీయ ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఆడబిడ్డలపై చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో నిందితులు శిక్షించేందుకు హోం శాఖ ప్రత్యేక ఫోర్సును ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తునట్లు తెలిపారు. బాలిక హత్య ఘటనలో నిందితుడిని అరెస్టుచేసి కఠినంగా శిక్షిస్తామని బాధిత కుటుంబానికి బరోసా కల్పించారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పోలీసు అధికారులతో మాట్లాడి నిందితుడిని త్వరగా అరెస్టు చేసేలా చూస్తామని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ వివరించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఉన్నారు.

జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు

- జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జూలై 17 : నకిలీ విత్తనాలను ఆదిలోనే నిరోధించేందుకు జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' లో 'నకిలీ విత్తనాల ఖిల్లా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో నకిలీ విత్తనాలు కట్టడి చేసేందుకు గుంటూరు జిల్లాలో అనేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడా నకిలీ విత్తనాల జాడ లేదని స్పష్టం చేశారు. ఆటోనగర్, మాంచెస్టర్ రోడ్డులో లూజు విత్తనాలు తీసుకు వచ్చి శుద్ధి చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఖచ్చితత్వం లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ జిల్లా నుండి విత్తనాలు కొనుగోలు చేసిన ఏ ఒక్క రైతు తను నకిలీలతో మోసపోయానని ఫిర్యాదు చేయలేదని తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టేందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ నెలలో రాష్ట్ర స్థాయి బృందాలు జరిపిన దాడుల్లో రూ.20 కోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడలేదని తెలిపారు. రూ.8.91 లక్షల పత్తి, మిరప, వరి విత్తనాలు పట్టుబడ్డాయని అవి నకిలీవి కాదని, సరైన పత్రాలు, స్టాక్ బోర్డులు లేనందున వాటి అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. విత్తన నిబంధన చట్టం పాటించని రూ.24.41 లక్షల విత్తనాలను అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు జాడ కనపడితే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ కు ఫిర్యాదు చేయాలని, నేరుగా రాలేని పక్షంలో సెల్ నెంబర్:8331056914,8331057038 కి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.

ట్రాన్‌ఫార్మర్లలో రాగి వైరు దొంగలింత

తుళ్లూరు, జులై 17: పొలాల్లో ఉన్న మూడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి వైరు దొంగలించిన విషయపై తుళ్లూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మల్కాపురం వాసి రైతు గద్దె చంద్ర శేఖర్ మందడం రెవెన్యూలో 6 ఎకరాలలో అరటి తోట సాగు చేస్తున్నారు. అందులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లలో రాగి వైరును దండగులు దొంగిలించారు. దీనిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీఐ-2 అనురాధ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆర్బీఎస్‌కే వ్యవహారంలో అధికారుల సీరియస్

● పాత సీఎం ఫొటో ఉన్న హెల్త్ కార్డులు వెనక్కి తీసుకోండి

● వైద్యాధికారులకు ఆదేశాలు

ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జూలై 17: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. పాత సీఎం ఫొటో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే వెనక్కి తెప్పించాలని జిల్లాలోని వైద్యాధికారులను బుధవారం ఆదేశించారు. 'ఆర్బీఎస్‌కేలో జగన్ భజన' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు స్పందించారు. ఈ విషయంలో కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారంటూ ఆర్బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ బాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వాయిస్ మెసేజ్ పంపారు. జగన్ ఫొటో ఉన్న హెల్త్ కార్డులు వెంటనే వెనక్కి తెప్పించాలని వైద్యాధికారులకు సూచించారు. వాటిని ఎవరూ పంపిణీ చేయవద్దని ఆదేశించారు.

అన్యాక్రాంతమైన దేవదాయ భూములను కాపాడాలి

● ఎండోమెంట్ ట్రిబ్యునల్ మరింత బలోపేతం చేయాలి

● మంత్రి రామనారాయణరెడ్డితో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మణరెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), జూలై 17: రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన దేవదాయ శాఖ భూములను కాపాడాలని దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రిని విజయవాడలో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను బలోపేతం చేసి త్వరగా దేవదాయశాఖ భూముల కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ లోపాలను ప్రజల దృష్టికి తెచ్చి దుర్మార్గ పాలనను అంతమొందించడంలో ఆనం క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆనం రామానారాయణరెడ్డి స్పందిస్తూ అన్యాక్రాంతమైన భూములన్నింటిని స్వాధీన పరచుకోవడానికి చర్యలు చేపట్టామని ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

వైసీపీ దోపిడీని బట్టబయలు చేస్తున్న శ్వేతపత్రాలు

● దామచర్ల శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలు కూటమి ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాలు బట్టబయలు చేస్తున్నాయని జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు రాష్ట్రంలో భూదోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. అందుకే ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో నెం: 512ను రద్దు చేసింది. ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేదల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నడం దారుణమని తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్థిక దోపిడీ వల్ల ఖజానాలో సొమ్ము లేకపోయినా వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం కోసం సొమ్ము సర్దుబాటు చేసి 65 లక్షల మందికి 4400 కోట్లు పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం కుప్పకూలిపోయి 11 సీట్లకే ప్రజలు పరిమితం చేసినా సిగ్గు లేకుండా మరలా అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, కూటమి ప్రభుత్వం మధ్యలోనే కూలిపోతుందని విజయసాయిరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం.. పెన్షనర్ల పాట్లు

గుంటూరు, జూలై 17: పెన్షనర్ల పిల్లల ఉద్యోగ ఉపాధి ఉన్నత విద్య అవకాశాల ప్రయత్నాల కోసం ఉపయోగించే వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆరోపించారు. దరఖాస్తులు పూరించటంలో నెలకొన్న సాంకేతిక స్వయంకృతాపరాధ సమస్యలు అభ్యర్థులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుంటే తల్లిదండ్రులను, యువతను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో వెబ్‌సైట్లలో పొందుపరిచిన ఫోన్ కాల్స్ జాబితాలు అలంకారప్రాయంగా మారగా, ఫిర్యాదుల విభాగం కూడా స్పందనకు దూరంగా ఉంటుందన్నారు. విద్యా సంవత్సరం ముగియగానే యువత ముందుండే అనేక రకాల పరీక్షల దరఖాస్తులకు ఆన్‌లైన్ వేదికగా మారుతుందన్నారు. పరీక్షలు నిర్వహించే విద్యాశాఖ, యూనివర్శిటీలు సంబంధిత పరీక్షలకు ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి అందులోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజులు వసూలు చేయటంతో పనులు సులువైపోతున్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు నిర్వహించే పీజీ సెట్, ఐసెట్, లాసెట్, ఎల్‌పీసెట్, ఆసెట్, పీజీ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలు ఎంసెట్, డైట్ సెట్ విద్యార్థుల ప్రవేశ పరీక్షలకు నిర్వహించే ఏపీ ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పలు సర్టిఫికెట్ కోర్సులు దాదాపు అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు. అయితే నిర్ణీత ఫీజు చెల్లించిన దరఖాస్తు చేసినా హాల్ టిక్కెట్లు వస్తాయో రావో, పరీక్షలకు అర్హత సాధించినా కౌన్సెలింగ్ సందర్భంలో ఏవైనా ఇబ్బందులు ఎదురౌతాయో ఏమో అని పలు రకాల సందేహాలు వారిని వెంటాడుతుండటంతో గత్యంతర లేక మరొకమారు ఫీజు చెల్లించి రెండు విధాలుగా నష్టపోవాల్సి వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారన్నారు. గతంలో ప్రతి దరఖాస్తుకు సబ్‌మిట్ చేసిన కొన్ని రోజుల వరకు ఎడిట్ అవకాశం ఇచ్చేవారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా వెబ్‌సైట్ల నిర్వహణను జరిపి టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయగానే స్పందించే విధంగా చర్యలు తీసుకొని యువతీ, యువకులు నష్టపోకుండా చూడాలని వీరయ్య కోరారు.

సామాన్యుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

గుంటూరు, జూలై 17: ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ నేతృత్వంలో రానున్న కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని అర్థశాస్త్ర శాఖోపన్యాసకులు సీహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రానున్న కేంద్ర బడ్జెట్ ఎలా ఉండాలి అనే అంశంపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనవంతులు అధిక పన్నులు చెల్లించగలరని, ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించటానికి ఈ డబ్బును ఉపయోగించటం వల్ల కార్మికుల డిమాండ్‌ను పెంచటం, చిన్న వ్యాపారులకు సాయం చేయటం, సాధారణ ప్రజల ఆదాయాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు చంద్రయ్య, సింగరయ్య తదితరులున్నారు.

వీక్లీ స్పెషల్ శానిటేషన్ యాక్షన్ ప్లాన్ పర్యవేక్షించాలి

● విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు ● కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కమిషనర్ కీర్తి

గుంటూరు(కార్పొరేషన్), జూలై 17: గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని ప్రజలకు అందించేందుకు వీక్లీ స్పెషల్ శానిటేషన్ యాక్షన్ ప్లాన్ మేరకు సూపర్వైజరి అధికారులు పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ హాల్లో నగర కమిషనర్ కీర్తితో కలిసి గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా జరిగేందుకు బుధవారం జీఎంసీ ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, సూపర్వైజరి అధికారుల సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ప్రజలు మెరుగైన పారిశుధ్యం, తాగునీటి సరఫరాని కోరుకుంటారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించడం కనీస బాధ్యత అని అన్నారు. గుంటూరు నగరంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని సాధించేందుకు ప్రతి డివిజన్‌లో వీక్లీ వర్క్ ప్లాన్ ఉండాలని, ప్లాన్ మేరకు పక్కాగా పనులు జరిగేలా సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్ల మీద వ్యర్థాలు ఉండడానికి వీల్లేదని, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగ అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఫిర్యాదులు వస్తే ఇరు విభాగాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అవుట్ ఫాల్ డ్రైన్లలో పూడిక తీత పనులు జరుగుతున్నప్పటికీ అంతర్గత వీధుల్లోని డ్రైన్లలో పూడికతీత జరగడం లేదని, ఫలితంగా వర్షాలకు డ్రైన్ ఓవర్ ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్ ద్వారా అంతర్గత డ్రైన్లు శుభ్రం చేసేలా సూపర్వైజరి అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం కోసం అధికారులను పిలిస్తే వెళ్లాలని తెలిపారు.

కమిషనర్ కీర్తి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వీక్లీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, ప్లాన్ మేరకు పారిశుధ్య పనులు చేపడతామన్నారు. ఇప్పటికే 16 మంది సీనియర్ అధికారులను పారిశుధ్య పర్యవేక్షణకు విధులు కేటాయించామని, నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో నిర్మాణం పెండింగ్‌లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల (జీటీఎస్) నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారులు తప్పనిసరిగా జీఎంసీ నుంచి కేటాయించిన వాహనంకే వ్యర్థాలను ఇవ్వాలని, రోడ్ల మీద, కాల్వల దగ్గర వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామన్నారు. నగరంలో కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాల సేకరణకు వెంటనే టెండర్ పిలవాలని ఎస్ఈని ఆదేశించారు. స్పెషల్ అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక ఇవ్వాలన్నారు. అనంతరం పారిశుధ్య సమస్యలు, పరిష్కారాలకు అభిప్రాయాలను సూపర్వైజరీ అధికారుల వారీగా తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో ఎస్ఈ శ్యాంప్రసాద్, ఎంహెచ్‌వో మధుసూదన్, ఏడీహెచ్ రామారావు, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ మురళి, ఈఈలు ఎస్ఎస్‌లు, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పండుగ



ప్రత్యేక అలంకరణలో స్వామి

గుంటూరు(తూర్పు),జూలై 17: తొలి ఏకా దశి పండుగను నగరంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదాన అర్చకులు మాధవ స్వామి బృందం స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలను అందుకున్నారు. సత్సంగ సభ్యులు కోలాటం ఆడారు. కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీ రామలింగేశ్వరస్వామికి అభిషేకాలంకరణ



శాకాంబరీ అలంకరణలో అమ్మవారు

స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మ శాస్త అయ్యప్పస్వామి దేవాలయం ఏంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తొలి ఏకా దశి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగే శ్వరస్వామికి అభిషేకార్చనలు. అమ్మవారికి శాకాంబరీ అలంకారం విశేష పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

శ్రీనివాసరావుపేటలో ఘనంగా మొహరం వేడుకలు

గుంటూరు, జూలై 17: నగరంలోని శ్రీనివాసరావుపేట నైజాం బజారు సెంటర్‌లో మొహర్రం వేడుకలు మంగళవారం రాత్రి అంగరంగా వైభవంగా జరిగాయి. పీర్ల చావిడి ఎదుట మేళతాళాలతో పీర్లను ఊరేగిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తదుపరి బుధవారం పీర్లకు ఊరేగింపు నిర్వహించి వేడుకలను ముగించారు. అలానే లాలాపేటలోని చిన్న మౌలా పంజా అషుర్‌ఖానాలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముతవల్లి ఖాదర్‌బాబా ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

'దళితోద్యమాలు -సామాజిక రాజకీయ పరిణామాలు'పై ఏడాది పాటు అధ్యయనం, సమీక్షలు

● డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్

గుంటూరు, జూలై 17: కారంచేడు-చుండూరు ఉద్యమాల స్ఫూర్తితో నాలుగు దశాబ్దాల 'దళితోద్యమాలు - సామాజిక రాజకీయ పరిణామాలు' అనే అంశంపై దేశవ్యాప్తంగా 2024 జూలై 17 నుంచి 2025 జూలై 17 వరకు(సంవత్సరం పాటు) అధ్యయనం, సమీక్షలు నిర్వహించనున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని డీబీఎఫ్ కార్యాలయంలో బుధవారం కారంచేడు 39వ దళిత ఆత్మగౌరవ సభలో ఆయన ప్రసంగించారు. ఏడాది పాటు అధ్యయనం, సమీక్షల అనంతరం 2025 ఆగస్టు 6న జాతీయ స్థాయిలో సామాజిక రాజకీయ ఉద్యమ శక్తులతో సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్‌కుమార్, నాయకులు పొందుగల ప్రకాష్, బుస్సా రత్నప్రసాద్, ఎం.సునీల్‌కుమార్, విప్పర్ల విజయ్ భాస్కర్, తురక మంగయ్య, మేడి శామ్యూల్, నాగబాబు, వాల్మీకి శ్రీనివాసరావు, ఏ.గాలయ్య కుమార్, మార్పుడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు మృతవీరుల ఆశయాలను కొనసాగించాలి

గుంటూరు(తూర్పు), జూలై 17: కారంచేడు మృత వీరుల ఆశయాలను కొనసాగించాలని స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబుమాదిగ పిలుపు నిచ్చారు. స్థానిక గోరంట్ల, సంఘ కార్యాలయంలో కారంచేడు మృతవీరుల 39వ సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన కులాల ఐక్యత ఉద్యమ నిర్మాణానికి, మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమానికి కారంచేడు ఉద్యమం రూపాంతరం చెందిందని తెలిపారు. దళితుల ఆత్మగౌరవం సాధించడమే కారంచేడు దళిత వీరులకిచ్చే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య మాదిగ, అబ్రహం, చంద్రశేఖర్, బాబురావు, ఎస్కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సాయి సత్య వ్రతాలు

గుంటూరు(తూర్పు), జూలై 17: స్థానిక విద్యానగర్ 3వ లైన్లోని శ్రీ సాయినాథ సన్నిదానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని అర్చకుడు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. వ్రతాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయి సచ్చరిత పారాయణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, మొవ్వా సంజీవరావు పర్యవేక్షిస్తున్నారు.



సాయి సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు

రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, పాల్గొన్న పాశం రామారావు తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 17: రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని నూతన ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు సూచించారు. బ్రాడిపేటలోని సీపీఎం కార్యాలయంలో వైనేతాజి అధ్యక్షతన బుధవారం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాజధానిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ శాఖల భవనాలు, నివాస భవనాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తూనే కాలపరిమితిని పెంచాలన్నారు. అసైన్డ్ రైతులకు ప్యాకేజిని పెంచాలని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని కోరారు. రాజధాని పేదలకు ఇస్తున్న పెన్షన్లు నెలకు రూ.6వేలకు పెంచాలన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక క్రిమినల్ చట్టాల్లో మార్పులు తెచ్చి ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించే చర్యలు చేపడుతున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, కె.నళినికాంత్, ఎస్.భావన్నారాయణ, ఎం.రవి, జొన్నా శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీరింగ్ కమిటీతో ఏఈఎల్‌సీ మరింత బలోపేతం : శ్యామ్‌కుమార్



ఐక్యత చాటుతున్న ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ సభ్యులు


గుంటూరు(తూర్పు), జూలై 17: నూతన ఏర్పాటైన స్టీరింగ్ కమిటీ తో ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) మరింతగా బలోపేతమవుతుందని స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఇసుకపాటి శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో నూతనంగా ఏర్పడిన స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు, విశ్వాసులు హాజరయ్యారు. శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ అధ్యక్షుడు లేని కారణంగా హైకోర్టు ఏఈఎల్‌సీని కాపాడేందుకు ఈ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. ఒకే ఎన్నిక, ఒకే రాజ్యాంగం, ఒకే అధ్యక్షుడు నినాదంతో కమిటీ ముందుకు వెళ్తుందని అన్నారు. ముఖ్యంగా లక్షల కోట్ల ఆస్తులున్న ఏఈఎల్‌సీలో కొందరు స్వార్థపరులు అడ్డగోలుగా అమ్మకాలు చేశారని, ఈ దోపిడీని అరికట్టడానికి కమిటీ కృషి చేస్తుందన్నారు. 2025లో 52వ ఏఈఎల్‌సీ అధ్యక్షుడు ఎన్నిక జరుగు తున్న సందర్భంగా పాస్టర్లు ఏకతాటిపైకి వచ్చి సమర్థుడ్ని ఎన్నుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రముఖ న్యాయవాది దాసరి నవీన్, కమిటీ సభ్యులు వేదాల దైజిబాబు, మురాల రత్నరాజు, చిన్న ఎలిషా, దళిత సంఘ నాయకుడు మేడిద బాబురావు, జయసుధ, ఎస్ మేరి, ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ముత్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రావణానందంగా శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), జూలై 17: స్థానిక బ్రాడీపేట శ్రీసిద్ధేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్ర ప్రాంగణంలో గాయత్రి సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సద్గురు శ్రీ నారాయణ తీర్థ జయంతి మహోత్సవాల సందర్భంగా బుధవారం జరిగిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్.నారాయణ మూర్తి జ్యోతి ప్రజల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కళాకారులు 20 మంది తమ గాత్రధారులలో నారాయణ తీర్థుల విరచిత తరంగాలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమాలను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎం వై శేషరాణి పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షకుడు పవన్‌కల్యాణ్

గుంటూరు, జూలై 17: జనసేన పార్టీ సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధిక ప్రాధాన్యం ఇస్తూ కార్యాచరణ రూపొందించడం ఎంతో సంతోషదాయకమని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ప్రకృతి ప్రేమికుడు, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు మంజునాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్ అగ్రహారంలోని ఎత్తురోడ్ సెంటర్లో జనసైనికులు పంచవటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లలో ఆనాటి ముఖ్యమంత్రి జగన్ పర్యటించిన ప్రతి ప్రాంతంలో చుట్టుపక్కల ఉన్న ఏళ్ల నాటి పచ్చని చెట్లను సైతం నరికేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పర్యావ రణ పరిరక్షణకు నడుం బిగించడం ముదావహం అన్నారు. కార్యక్రమంలో జీ.వెంకట్రావు, ఆకుల వెంకటేశ్వర్లు, తన్నీరు ఉదయ్, కేదార్, చైతన్య, బెల్లంకొండ రాము, నాజర్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న హరి, మంజునాథ్ తదితరులు



సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గళ్లా మాధవి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని 19వ డివిజన్ నల్లచెరువు 2వ లైనులో సైడ్ కాలువల నిర్మాణానికి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.37 లక్షలతో నల్లచెరువులో సైడ్ డ్రైన్ల నిర్మాణం చేపట్టబోతున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో డ్రైనేజీ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల అనేక రోగాలు వస్తున్నాయని, అందువల్ల పారిశుధ్య పనులకే తన తొలి ప్రాధాన్యం ఇచ్చామని ఆమె చెప్పారు. అనేక చోట్ల మురుగునీరు రోడ్ల మీద పొంగిపొర్లుతోందని, వాటన్నిటిపై తాను దృష్టి పెట్టానని, అవసరమైన చోట్ల క్షేత్ర స్థాయిలో తానే స్వయంగా పర్యటించి వాటిని మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకొని వెళ్లానని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గంలోని సమస్యలకు పరిష్కారం లభించబోతున్నట్లు మాధవి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, రాళ్లబండి రామరాజు, తెలుకుట్ల హనుమాయమ్మ, పానకాల లక్ష్మణ్, రహీం, చంద్రగిరి బాబు, యోగేశ్వరరావు, పులి కృష్ణ, బత్తుల రమణమ్మ, టెంట్ హౌస్ బాబు, పరిమి రమేష్, ఉమర్ వలి, విజయలక్ష్మి, ఆంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో బుధవారం గళ్లా మాధవి పాల్గొన్నారు. సంపత్‌నగర్‌లో వారాహి అమ్మవారి దేవాలయంలో, ఐపీడీ కాలనీలో సత్యసాయి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. హోటల్స్ అండ్ అలైడ్ ఇన్‌స్టిట్యూట్స్ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే నసీర్



ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న నసీర్

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఏకలవ్య జయంతి సందర్భంగా గుంటూరు నాజ్‌సెంటర్లోని ఏకలవ్య విగహానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజలందరికి తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గురు భక్తి చాటే విషయంలో విద్యార్థులు ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్య వృత్తిని నేర్పించే గురువులతో అంకితభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమత, గుంటూరు ఏకలవ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



షోరూంలో అమ్మకాలను ప్రారంభిస్తున్న తులసీ రామచంద్రప్రభు, చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు, జూలై 17: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని విశ్వ సుభ కాంప్లెక్స్‌లో రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల షోరూంను తులసీ గ్రూపు సంస్థల చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు, పయినీర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత చుక్కపల్లి రమేష్‌లు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు షోరూంలో వస్త్రాలను పరిశీలించారు. నాణ్యతకు, మన్నికకు రామ్‌రాజ్ ఎంతో ప్రాముఖ్యతనిస్తుందని, అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో అందించటం అభినందనీయమన్నారు. అనంతరం తొలి విక్రయాలను తులసీ రామచంద్రప్రభు, చుక్కపల్లి రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ సంస్థ ఏరియా మేనేజర్ ఉదయ్‌భాస్కర్, క్లస్టర్ మేనేజర్ రాకేష్, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, షోరూం మేనేజర్ కుమార్ రాజా తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 17 : విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేకేసీ కళాశాల రోడ్డు, మహిళా పాలిటెక్నికల్ కళాశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టి.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి నగరంలో 'ఏపీ న్యూరోకాన్ 2024'

● మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వైద్య సదస్సు

● రాష్ట్రవ్యాప్తంగా 600 మంది వైద్యనిపుణులు హాజరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విజయ, కుమారవేలు, బాబ్జి తదితరులు

గుంటూరు (మెడికల్) జూలై 17: నగరంలోని శ్రీకన్వెన్షన్ సెంటర్లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ 31వ వార్షిక సదస్సు 'ఏపీ న్యూరోకాన్ 2024' నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ.విజయ వెల్లడించారు. బుధవారం కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఎన్ఎస్ఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి వైద్య సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి 600 మందికి పైగా న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు పాల్గొంటున్నట్లు డాక్టర్ విజయ తెలిపారు. దేశంలో ప్రఖ్యాతి చెందిన పలువురు న్యూరో సైంటిస్టులు ప్రధాన వక్తలుగా హాజరై నరాల వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, కొత్త చికిత్స విధానాలను వివరిస్తారని ఆమె చెప్పారు. సదస్సులో సైంటిఫిక్ సెషన్లు, లైవ్ వర్క్‌షాప్‌లు, పరిశోధన పత్రాలు, పోస్టర్ ప్రజంటేషన్లు, పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరికి మెదడు ఆరోగ్యం అనే నినాదంతో ఆదివారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు గుంటూరులో నడక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విజయ తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, న్యూరోసర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు మాట్లాడుతూ శనివారం ఉదయం పదిన్నర గంటలకు సదస్సు ప్రారంభోత్సవానికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జేఎంకే మూర్తి, న్యూరోసర్జన్ డాక్టర్ బీ దిబ్బల్‌రావును జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.కుమారవేలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌కుమార్ బాబ్జీ, డాక్టర్ ఉప్పాల వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఈఐఈ/ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1ZB524Mలో చదవండి.



ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధృవాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎస్బీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'...
కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం

- దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్లు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి




ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!




అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేకమేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.







డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు తదితరులు

డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు

తెనాలి, మారీసుపేట జూలై 17: పట్టణంలో డ్రెయిన్‌లలోని పూడిక తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు కొనసాగిస్తున్నారు. స్థానిక బోసురోడ్డులో బుధవారం డ్రెయిన్‌లలోని వ్యర్థాలను, రోడ్డు ఆక్రమణను తొలగించిన తరువాత వచ్చిన వ్యర్థాలను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర సౌరసరఫర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పర్యవేక్షణలో ఆక్రమణలను, పూడిక తొలగింపును కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మ

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ: డీఎస్‌వో పద్మ

తెనాలి అర్బన్, జూలై 17: ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు సబ్సిడీ ధరలపై బియ్యం, కందిపప్పు అందిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని గాంధీపార్కు రైతు బజారులో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. గంగానమ్మపేట రైతుబజారులో విక్రయాలు కూడా పరిశీలించారు. కిరాణా అసోసియేషన్‌ను సంప్రదించి కిరాణా దుకాణాలలో కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. కిలో కందిపప్పు రూ.160, కిలో బియ్యం రూ.48, 49లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాల్లోని అన్ని ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారని తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని షణ్ముఖ రైస్‌బజారులో కూడా ఈ విక్రయాలు చేస్తున్నామని చెప్పారు. తక్కువ ధరలకు నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని విక్రయించే కౌంటర్‌ను ఏర్పాటు చేసిన వ్యాపారిని అభినందించారు. సీఎస్‌డీటీ జేవీ ఎస్ఎన్ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ రామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి పావులూరి రాంబాబు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 17: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్ర సభ్యులు అన్నదానం చేశారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమంలో బుధవారం ఎస్‌వీ యోగా సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యం శివం, సుందరం వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్, చుక్కా భానుప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై కోటేశ్వరరావు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

బోధ వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం

తెనాలి అర్బన్, జూలై 17: 20 మంది కుష్టు, బోధ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయంసాయం అందజేశారు. పాత ప్రభుత్వ వైద్యశాలలో మలేరియా, ఫైలేరియా కంట్రోల్ యూనిట్ కార్యాలయంలో బుధవారం సబ్ యూనిట్ అధికారి ఉమా కాంత్, రవికుమార్ ఈ సాయం చెక్కులు పంపిణీ చేశారు. తెనాలి డబుల్ హార్స్ ఆర్థిక సహకారంతో లెప్రా సొసైటీ ద్వారా వ్యాధిగ్రస్తుల పిల్లలు ఉన్నత విద్య చదివేందుకు, స్వయం ఉపాధికి అవసరమైన సాయాన్ని అందించామన్నారు. ప్రతి నెలా 3వ బుధవారం వ్యాధిగ్రస్తులకు శిబిరం నిర్వహించి అవసరమైన మందులు, పాదరక్షలు అందిస్తున్నామన్నారు. కో-ఆర్డినేటర్ రాధిక, నాగరాజు, చంద్రమౌళి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

కారంచేడు మృతులకు నివాళి

తెనాలి అర్బన్, జూలై 17: రైల్వేస్టేషన్ రోడ్డులోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం కారంచేడు మృతులకు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, జైభీమ్, బీజేఆర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మేకల సురేష్, దేవయ్య, రాజారావు, అనిల్‌కుమార్, నాగరాజు, అరుణ, కోటేశ్వరరావు, సద్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), జూలై 17: స్థానిక బ్రాడీపేట శ్రీసిద్ధేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్ర ప్రాంగణంలో గాయత్రి సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సద్గురు శ్రీ నారాయణ తీర్థ జయంతి మహోత్సవాల సందర్భంగా బుధవారం జరిగిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్.నారాయణ మూర్తి జ్యోతి ప్రజల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కళాకారులు 20మంది శ్రావ్యంగా ఆలపించారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు



పూర్తిగా దెబ్బతిన్న కొల్లిపర- నందివెలుగు రోడ్డు



గోతులు, బురదమయంగా మారిన సిరిపురం- తెనాలి రహదారి



అధ్వానంగా తయారైన చివలూరు- మున్నంగి రోడ్డు

కొల్లిపర, జూలై 17: అధికారుల పర్యవేక్షణ లోపం... కాంట్రాక్టర్ల స్వార్థం .. వెరసి సుదీర్ఘకాలం ఉండాల్సిన రోడ్లు అనతి కాలంలోనే దెబ్బతింటున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకప్రాయంగా మారుతోంది. రోడ్లు దెబ్బతిన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొల్లిపర మండలంలో పలు గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు, రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లు దెబ్బతిని సంవత్సరాల తరబడి అవుతున్నా కనీస మరమ్మతులు చేసేందుకైనా అధికారులు పట్టించుకోకపోవడంతో అధికారులపై గ్రామసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో దావులూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. రోడ్డు నిర్మాణం నాణ్యతాలోపం ఉండటంతో అతి తక్కువ కాలంలో దెబ్బతిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం చేస్తున్నారు. అదేవిధంగా చివలూరు నుంచి మున్నంగి వెళ్ళే రోడ్డు కూడా మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలు, గుంతలుగా మారడంతో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ రహదారిలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వాహనదారులు వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. అదే విధంగా సిరిపురం నుంచి తెనాలి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు గోతులు మయంగా మారటంతో పాటు గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ఆ రోడ్డుపై నడవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా రోడ్లను నూతనంగా వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● ఆలయాల్లో ఏక నామసంకీర్తనలు



వైకుంఠపురం దేవస్థానంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు

తెనాలి రూరల్, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హిందూ సంప్రదాయంలో ప్రాముఖ్యమున్న తొలి పండుగ తొలి ఏకాదశి. తొలి పండుగను పురస్కరించుకుని వైష్ణవాలయాలకు బుధవారం తెల్లవారుజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివార్లను దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వైకుంఠపురం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి దర్శనానికి విచ్చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుతీరి కనిపించారు. పలు భజనబృంద సభ్యులు ఆలయంలో స్వామి వారి భక్తికీర్తనలను ఆలపించారు. దర్శనమనంతరం ఆలయంలో భక్తులకు పేలాల పిండిని ప్రసాదంగా ఆలయ అర్చకస్వాములు పంపిణీచేశారు.



శలపాడులో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణభగవానుడు

కొల్లిపర మండలంలో..

కొల్లిపర, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూములూరు, హనుమాన్‌పాలెం, దావులూరు, చివలూరు, అత్తోట, అన్నవరం దేవాలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో, విష్ణు ఆలయాల్లో వివిధ అభిషేకాలు నిర్వహించడంతో మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చారు. పండితులు తీర్థప్రసాదాలను అందజేశారు. కొల్లిపరలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో, శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో పండితులు జగన్నాధాచార్యులు, కుటుంబరావులు దేవతామూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో వారితో పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని బాబాకు వివిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. బాబాను భక్తులను కనులారా వీక్షించారు.



ప్రత్యేక పూజలందుకున్న తెలగపాలెం కోదండ రామస్వామి

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో వైష్ణావాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో ఉదయం పంచామృత అభిషేకాలను మూలవిరాట్‌లకు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష తులసీ దళాలతో హనుమత్ లక్ష్మణ సీత సమేత కోదండ రామస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వీరాంజనేయస్వామి ఆలయం, భావనారాయణస్వామి ఆలయం, సాయి మందిరాల్లో తొలి ఏకాదశి పూజలు జరిగాయి. చేబ్రోలు మండలంలోని శలపాడులోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలలు నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత, వేణుగోపాలస్వామి మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు 24గంటల పాటు ఏకనామ భజన కార్యక్రమం ప్రారంభించారు. గురువారం ఉదయం వరకు ఈ ఏకనామ భజన కార్యక్రమం కొనసాగనుంది.

దశావతార వేంకటేశ్వస్వామి ఆలయంలో...

పెదకాకాని, జూలై 17: శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా సామూహిక లక్ష తులసి అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



కొల్లిపర శ్రీజనార్థనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా మొహరం పండుగ

భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

కొల్లిపర, జూలై 17: మండలంలోని గ్రామాల్లో ముస్లింలు మొహరం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్నంగి, కొల్లిపర, తూములూరు, దావులూరు, తదితర గ్రామాల్లో ముస్లింలు పండుగగా జరుపుకున్నారు. పిడపర్రులో ట్రాక్టర్‌పై మొహరం పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో షేక్ రఫీ, షేక్ జాన్‌పీరా, షేక్ గౌస్, షేక్ పర్వేజ్, షేక్ సుబానీ తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరులో పీర్లను ఊరేగిస్తున్న యువత

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూలై 17: మొహరం పండగను పురస్కరించుకుని బుధవారం పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. పీర్ల చావిడిలో మొహరం పురస్కరించుకుని హజరత్ మొహ్మద్ మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మతసామరస్యానికి ప్రతీకగా నిల్చిన ఈ మొహరం వేడుకలను పురస్కరించుకుని అషూరఖాన నుంచి చిన్న షరగతులు, పెద్ద షరగతులు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫకీర్ల తాషా మేళ ఆకట్టుకుంది. పట్టణంలోని పీర్ల చావిడి నుంచి పాతపొన్నూరులోని కార్బల వరకు ఈ ఊరేగింపు సాగింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పీర్లను కార్బలల్లో భద్రపరిచి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొల్లా ముజావర్ల కమిటీ నిర్వాహకులు మొల్లా కరీమ్, ఫైదర్, గబ్బర్ బాషా, సందానీ, నజీర్, షేక్ ఖాదర్, షేక్ మున్నావర్, నాజముద్దీన్, కలీల్ బాషా, బాజీ, గౌస్, అఫ్రీద్, హర్షద్, జలీల్, ఇమ్రాన్, షేక్ రఫీ, అమీన్ తదితరులు పాల్గొన్నారు.



పిడపర్రులో ట్రాక్టర్‌పై మొహరం పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గుంటూరు(తూర్పు), జూలై 17: రాజధాని అభివృద్ధి కి నిధులు కేటాయించాలని నూతన ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు సూచిం చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో వై.నేతాజి అధ్యక్షతన బుధవారం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాజధానిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ శాఖల భవనాలు, నివాస భవనాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తూనే కాలపరిమితిని పెంచాలన్నారు. అసైన్డ్ రైతులకు ప్యాకేజిని పెంచాలని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని కోరారు. రాజధాని పేదలకు ఇస్తున్న పెన్షన్లు నెలకు రూ.6వేలకు పెంచాలన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక క్రిమినల్ చట్టాల్లో మార్పులు తెచ్చి ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించే చర్యలు చేపడుతున్నారని ఈ విధానాలకు వ్యతిరేఖంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, కె.నళినికాంత్, ఎస్.భావన్నారాయణ, ఎం.రవి, జొన్నా శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో వర్షానికి జలమయమైన రోడ్డు

కొల్లిపరలో భారీ వర్షం

● జలమయమైన రహదారులు

కొల్లిపర, జూలై 17: మండలంలో బుధవారం రాత్రి కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వల్లోని రోడ్లపైకి చేరి నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. అధికంగా వర్షం నీరు చేరడంతో గృహాల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో ప్రధాన రహదారులు సహితం నీటితో నిండిపోయాయి. శివాలయం దగ్గర నుంచి గ్రామ పంచాయతీ వరకు నీటితో నిండిపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.



మన్యం వీరుడి ఏకలవ్యుడికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

పొన్నూరు టౌన్, జూలై 17: గురువులను ఆరాధించటంలో ఏకలవ్యుడికి సాటి మరొకరు రారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో మహావీరుడు ఏకలవ్యుడు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్‌ను కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఏకలవ్యుడు గురుదక్షణగా తన కుడి చేతి బొటనవేలుని గురువుకి అర్పించి మహోన్నతుడిగా నిలిచారన్నారు. మన్యం వీరుడిగా, గురువు ప్రియ శిషుడిగా పేరుగాంచిన ఏకలవ్యుడు గురువులను ఆరాధించటంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం ఏకవలవ్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులతో పాటు, ఏకలవ్య విగ్రహ కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి

చేబ్రోలు, జూలై 17: మండల పరిధిలోని నారాకోడూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జాలాది రాజేంద్ర ప్రసాద్, బుధవారం మృతి చెందారు. రాజేంద్ర ప్రసాద్ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రాజేంద్ర ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల, నారాకోడూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

బాలికను హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, జూలై 17: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంకు చెందిన 7 వ తరగతి విద్యార్థిని అదే గ్రామానికి చెందిన నాగరాజు హత్యచేసి రోజులు గడుస్తున్న కేసులో పురోగతి లేదని తక్షణమే నిందితుడిని అదుపులోకి తీసుకుని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొలకలూరులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ మైనర్ బాలిక శైలజపై కిరాతకంగా వ్యవహరించి హత్యచేసిన నాగరాజు కేసుపై పోలీసులు పురోగతి సాధించకపోవడం బాధాకరమన్నారు. బాలిక హత్యకేసును పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎమార్పీఎస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తామని హెచ్చరించారు. బాధిరాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉన్నం రాంబాబు, మోదుకూరి దావీదు, ఉన్నం చిన్నజాను, ఉన్నం అంతోను, ఉన్నం సన్నీ, ఉన్నం ఇమ్మానుయేలు, గోపి, గొరికపూడి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

● జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వెంకయ్యానాయుడు

కొల్లిపర, జూలై 17: ఈ నెల 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న 4వ విడత జనసేన సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క జనసైనికుడు కొత్త సభ్యత్వ నమోదు పాటు రెన్యూవల్ కార్యక్రమం జరిగేలా తమవంతు కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలు మేరకు ఎక్కువమందిని సభ్యత్వం చేర్పించాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, పెరికల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం

● ఇబ్బందులు పడుతున్న పెన్షనర్లు

గుంటూరు, జూలై 17: పెన్షనర్ల పిల్లల ఉద్యోగ ఉపాధి ఉన్నత విద్య అవకాశాల ప్రయత్నాల కోసం ఉపయోగించే వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆరోపించారు. దరఖాస్తులు పూరించటంలో నెలకొన్న సాంకేతిక స్వయంకృతాపరాధ సమస్యలు అభ్యర్థులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుంటే తల్లిదండ్రులను, యువతను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో వెబ్‌సైట్లలో పొందుపరిచిన ఫోన్ కాల్స్ జాబితాలు అలంకారప్రాయంగా మారగా, ఫిర్యాదుల విభాగం కూడా స్పందనకు దూ రంగా ఉంటుందన్నారు. విద్యా సంవత్సరం ముగియగానే యువత ముందుండే అనేక రకాల పరీక్షల దరఖాస్తులకు ఆన్‌లైన్ వేదికగా మారుతుందన్నారు. పరీక్షలు నిర్వ హించే విద్యాశాఖ, యూనివర్శిటీలు సంబంధిత పరీక్షలకు ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి అందులోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజులు వసూలు చేయటంతో పనులు సులువైపోతున్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు నిర్వహించే పీజీ సెట్, ఐసెట్, లాసెట్, ఎల్‌పీసెట్, ఆసెట్, పీజీ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలు ఎంసెట్, డైట్ సెట్ విద్యార్థుల ప్రవేశ పరీక్షలకు నిర్వహించే ఏపీ ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పలు సర్టిఫికెట్ కోర్సులు దాదాపు అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు. అయితే నిర్ణీత ఫీజు చెల్లించిన దరఖాస్తు చేసినా హాల్ టిక్కెట్లు వస్తాయో రావో, పరీక్షలకు అర్హత సాధిం చినా కౌన్సెలింగ్ సందర్భంలో ఏవైనా ఇబ్బందులు ఎదురౌతాయో ఏమో అని పలు రకాల సందేహాలు వారిని వెంటాడుతుండటంతో గత్యంతర లేక మరొకమారు ఫీజు చెల్లించి రెండు విధాలుగా నష్టపోవాల్సి వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారన్నారు. గతంలో ప్రతి దరఖాస్తుకు సబ్‌మిట్ చేసిన కొన్ని రోజుల వరకు ఎడిట్ అవకాశం ఇచ్చేవారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా వెబ్‌సైట్ల నిర్వహణను జరిపి టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయగానే స్పందించే విధంగా చర్యలు తీసుకొని యువతీ, యువకులు నష్టపోకుండా చూడాలని వీరయ్య కోరారు.